

12న కెజిఆర్ఎల్ ఫార్మసీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కళాశాల డైరెక్టర్ కె.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక ది భీమవరం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుపుతున్న కెజిఆర్ఎల్ ఫార్మశీ కళాశాలలో ఈ నెల 12వ తేదీన దివిస్ ఫార్మా లబ్రోరీస్ లిమిటెడ్ వారు విశాఖపట్నం, కాకినాడ హైద్రాబాద్ సమీపంలో ఉన్న బల్కుడ్రగ్ ప్రొడక్షన్ విభాగంలో పనిచేసేందుకు గాను కాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డి.రాఘవ, వైస్ ప్రిన్సిపల్ కె.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.ఫార్మసీ, ఎం ఫార్మసీ, బిఎస్‌సి, కెమిస్ట్రీ, బిటెక్ కెమికల్ ఇంజినీరింగ్ డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆయా విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరై ప్రతిభను చాటుకోవాలని కోరారు.

మంత్రులెవరో..!

సీనియర్ నేతలంతా గంపెడాశతో ఎదురుచూపులు

మంత్రుల జాబితా నేడు వెల్లడయ్యే అవకాశం

ప్రముఖంగా పితాని, నిమ్మల పేర్లు

జనసేన, బిజెపికి కేటాయింపుపై పలు ఊహాగానాలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా నుంచి బుధవారం ప్రమాణస్వీకారం చేసే మంత్రులెవరో అంటూ సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేడు ఎన్‌డిఎ ఎంఎల్‌ఎలు అంతా సమావేశం కానున్నారు. సిఎం అభ్యర్థి నిర్ణయం, సాయంత్రానికి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే నేతల పేర్లు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో తొలి కేబినెట్‌లో జిల్లా నుంచి ఎవరు మంత్రివర్గంలో ఉంటారనే చర్చ సర్వత్రా కొనసాగుతోంది. ఈ నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. మంత్రివర్గ కూర్పుపై సైతం కసరత్తు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. జిల్లా నుంచి ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పేర్లు ప్రముఖంగా విన్పిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా స్పష్టత మాత్రం రాలేదు. జిల్లా నుంచి ఒకరు లేక ఇద్దరు మంత్రులుగా ఉండే అవకాశం ఉంది. కేబినెట్‌లో 25 మందిని మంత్రులుగా నియమించే అవకాశం ఉంది. రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాలు ఉన్నాయి. జిల్లాకు ఇద్దరు చొప్పున మంత్రులుగా నియమిస్తేనే అన్ని జిల్లాలకు న్యాయం జరుగుతుంది. 13 జిల్లాల్లో దాదాపు ఎనిమిది జిల్లాలో టిడిపి క్లీన్‌స్వీప్ చేస్తూ అన్ని స్థానాలనూ గెలుచుకుంది. మంత్రివర్గంలో ఏ జిల్లాకు సరైన ప్రాతినిధ్యం లేకపోయినా తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రతి జిల్లాలోనూ సీనియర్ నేతలు ఎక్కువగానే ఉన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పరిశీలిస్తే మూడుసార్లు ఎంఎల్‌ఎగా గెలుపొందిన నిమ్మల రామానాయుడు, తణుకు నుంచి రెండుసార్లు ఎంఎల్‌ఎగా గెలుపొందిన ఆరిమిల్లి రాధాకృష్ణ, గతంలో కాంగ్రెస్‌లో, 2014 నుంచి 2019 వరకూ టిడిపిలో మంత్రిగా పని చేసిన పితాని సత్యనారాయణ, దెందులూరు నుంచి మూడోసారి ఎంఎల్‌ఎగా గెలిచిన చింతమనేని ప్రభాకర్, జగన్‌పై తిరుగుబాటు చేసి పేరొంది టిడిపి నుంచి ఉండి ఎంఎల్‌ఎగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి, నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారధి వంటి వారు మంత్రి పదవుల రేసులో ఉన్నారు. కైకలూరు ఎంఎల్‌ఎగా బిజెపి తరపున గెలిచిన కామినేని శ్రీనివాస్, భీమవరం నుంచి మూడోసారి ఎంఎల్‌ఎగా జనసేన నుంచి ఎన్నికైన పులపర్తి ఆంజనేయులు వంటివారి పేర్లు కూడా విన్పిస్తున్నాయి. వీరంతా ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరంగా చేస్తున్నారు. శెట్టిబలిజ కోటా నుంచి పితాని సత్యనారాయణ, కాపుల కోటా నుంచి నిమ్మల రామానాయుడు పేర్లు విన్పిస్తున్నప్పటికీ అనేక ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. 2014 టిడిపి ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణలో మంత్రి పదవి ఇవ్వలేదని దెందులూరు ఎంఎల్‌ఎగా ఉన్న చింతమనేని అలగడం, తర్వాత ఆయన్ని బుజ్జగించడానికి విప్ పదవి ఇవ్వడం సైతం జరిగాయి. ప్రతిపక్షంలో ఉండగా జిల్లాలో టిడిపికి నిమ్మల రామానాయుడు దిక్సూచిగా నిలిచారు. దీంతో మంత్రి పదవులు ఎవరికి దక్కుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అదే తరుణంలో జనసేనకు, బిజెపికి జిల్లా నుంచి మంత్రి పదవుల్లో ప్రాతినిధ్యం ఉంటుందా అనే చర్చ సైతం నడుస్తోంది. అదే జరిగితే పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన ఆరు స్థానాల్లో పోటీ చేసి గెలిచింది. తూర్పుగోదావరి జిల్లా కోటాలో పవన్ కల్యాణ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. పూర్వపు పశ్చిమలో జనసేనకు ఒక మంత్రి పదవి కేటాయిస్తే ఎవరికి ఆ పదవి దక్కుతుందనే చర్చ సైతం పెద్దఎత్తున నడుస్తోంది. ఇప్పటి వరకూ మంత్రి పదవులకు సంబంధించి ఎటువంటి లీకేజీలు వెలువడలేదు. మంగళవారం మంత్రి పదవుల జాబితాపై స్పష్టత రానున్నట్లు చెబుతున్నారు. దీంతో నాయకుల అనుయాయులంతా తమ నాయకుడికి మంత్రి పదవి వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

నక్కల కాలువను ఆధునికీకరించాలి

కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలోని పెరవలి మండలం కాకరపర్రు నుంచి యలమంచిలి మండలం వడ్డిలంక వరకూ ఉన్న నక్కల కాలువను తక్షణం ఆధునికీకరించాలని, వడ్డిలంక వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగించి ముంపు నీరు బయటకు తోడేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ పెనుగొండ, ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాలను ఆనుకొని ఉన్న నక్కల మురుగుకాలువను ఆనుకొని అనేక గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ప్రధానంగా వరి, కూరగాయలు, ఆక్వా పంటలు సాగుచేస్తున్నారన్నారు. అయితే ఏటా అధిక వర్షాలు, వరదల సమయంలో ఈ కాలువను ఆనుకొని ఉన్న అన్ని గ్రామాల్లోని పంటలు ముంపునకు గురై దెబ్బతిని రైతులు, కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం వడ్డిలంక గోదావరి వద్ద ఏర్పాటు చేసిన స్లూయిస్‌ను సక్రమంగా నిర్వహించకపోవడం, ప్రతి సంవత్సరమూ తలుపులు ఆధునికీకరించకపోవడం వర్షాలు, వరదల సమయంలో ముంపునీరు గోదావరిలోకి వెళ్లకపోవడం, గోదావరి హెచ్చునీరు గ్రామాలకు పొడవడంతో ప్రధానంగా కాంబొట్లపాలెం, చినదిబ్బ, గుంపర్రు, వద్దిపర్రు, గుమ్ములూరు, రావిపాడు, పెనుమర్రు, కట్టకాలువ, నార్నిమెరక, చిరగాలపల్లి, ఆచంటవేమవరం, ఆచంట, శేషమ్మ చెరువు, దేవ, సోమరాజు చెరువు తదితర గ్రామాలు ముంపుకు గురై ఏటా పంట కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులు, పోడూరు మండల మాజీ అధ్యక్షులు నడింపల్లి రామభద్రరాజు, దొమ్మేటి జనార్దన్, గన్నమనేని వీరభద్రం, జడ్డు బదరీనారాయణ, దొంగ నాగేశ్వరరావు మాట్లాడారు. సార్వా సమయంలో ముంపు సమస్యతో నాలుసార్లు నారుమడి వేస్తున్నామని, అయినా ఏదో సమయంలో పంట మునిగిపోయి నష్ట పోతున్నామన్నారు. నక్కల కాలువను, వడ్డిలంక వద్ద స్లూయిస్ తలుపులను వెంటనే ఆధునికీకరించాలని కోరుతూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, తన వంతు నిధులు కేటాయిస్తానని, రైతులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కౌలురైతులు, రైతులు కాండ్రేగుల హరిబాబు, శీలబోయిన నాగేశ్వరరావు, గుడాల పద్మనాభం, అధికారి గంగాచలం, ఆకుమర్తి దాసు, పల్లె జార్జిబాబు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని మూసి వేయడం తగదు

సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్

ప్రజాశక్తి - గణపవరం

సరిపల్లి గ్రామం లోని సిపిఎఫ్ ఫ్యాక్టరీని థాయిలాండ్ యాజమాన్యం మూసి వేయడం తగదని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ తెలిపారు. సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు చేస్తున్న నిరసన దీక్ష సోమవారం నాలుగో రోజుకు చేరింది. ఈ దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామంలో 11 సంవత్సరాలు సిపిఎఫ్ ఫ్యాక్టరీలో చేపలు, రొయ్యలు మేతల తయారీ చేసిందని, భారీ లాభాలతో ఫ్యాక్టరీ నడిచిందని తెలిపారు. నేడు దేశ వ్యాప్తంగా ఉన్న ఈ ఫ్యాక్టరీలు లాభాల బాటలో నడుస్తున్నాయని, సరిపల్లిలోని ఫ్యాక్టరీ మాత్రం నష్టాల్లో ఉందని తెలిపారు. యాజమాన్యం సాకులు చూపించి ఫ్యాక్టరీని ఏకపక్ష నిర్ణయంతో మూసివేయడం తగదని అన్నారు. ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగ కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. ఉద్యోగ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి న్యాయం చేసేలా వచ్చే కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి కార్మికులకు, ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని ఆయన హెచ్చరించారు. ఈ ఫ్యాక్టరీలో ఇంజినీర్లుగా పనిచేస్తూ బిటెక్, ఎంబిఎ, డిగ్రీ చదివి ఉద్యోగులుగా చేస్తున్నారని, వారందరికీ న్యాయం చేయాలని యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు, కార్యదర్శి పి.గోవిందు, గుత్తుల శ్రీనివాస్, దండు రామలింగరాజు, ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ధాన్యం డబ్బులు వెంటనే ఇవ్వాలని ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయం వద్ద ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లాలో రైతులు దాళ్వా పంట అమ్మి దాదాపు రెండు నెలలు గడుస్తోందన్నారు. ఇంతవరకూ ప్రభుత్వం రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వలేదని, జిల్లాలో పంటలు పండించేది కౌలు, పేద రైతులు మాత్రమేనని వీరంతా పెట్టుబడి నిమిత్తం లక్షలాది రూపాయలు ప్రయివేటు అప్పులు తెచ్చి పంటకు పెట్టుబడి పెడుతున్నారన్నారు. ప్రభుత్వం నెలల తరబడి ధాన్యం డబ్బులు ఇవ్వకపోవడంతో తెచ్చిన అప్పులకు అధిక వడ్డీలు కట్టి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు వరికోత మిషన్, కూలీలు, బరకాలు, ధాన్యం ఎగుమతి వంటి ఖర్చులు ఉండడంతో పాటు, సార్వా సాగు ముందుకు రావడంతో రైతాంగం ఆర్థిక ఇబ్బందులకు గురౌతోందన్నారు. జిల్లాలో దాదాపు 70 వేల మంది రైతులకు రూ.వెయ్యి కోట్లు చెల్లించాలని, తక్షణం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ధాన్యం డబ్బులు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుల సంఘం నాయకులు, రైతులు కవురు శ్రీనివాస్, పిల్లి కామేశ్వరరావు, నెక్కంటి శ్రీనివాసు, చేబ్రోలు బాలాజీ, కొండేటి నర్సింహారావు, కొండేటి సత్యనారాయణ, నందమూరి రామకృష్ణ పాల్గొన్నారు.

జిఒ 117ను రద్దు చేయాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నూతన ప్రభుత్వం తక్షణం జిఒ 117ను రద్దు చేసి, అన్ని పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు మీడియం కొనసాగించాలని, అమానుషమైన సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందుగా ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అలుగు ఇజ్రాయిల్ రాజు ఆవిష్కరించారు. యుటిఎఫ్ పతాకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి. రామభద్రం ఆవిష్కరించారు. కార్యకలాపాల, నిర్మాణ నివేదికను ప్రధాన కార్యదర్శి రామభద్రం, సంతాప తీర్మానాలను సహాధ్యక్షులు కె.రాజశేఖర్, ఆర్థిక నివేదికను కోశాధికారి సిహెచ్ పట్టాభిరామయ్య ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పలు కీలక తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు, పిఆర్‌సి బకాయిలు, ఎపిజిఎల్ఐ, పిఎఫ్, మెడికల్ బిల్లులు తక్షణం చెల్లించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. పదో తేదీ వచ్చినప్పటికీ ఇంకా ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణం చెల్లించాలని కోరారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 49 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది పొడవున స్వర్ణోత్సవాలు జరపాలని, ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై, సమకాలీన అంశాలపై విద్యా సదస్సులు, గోష్టులు, కార్యశాలలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ స్వర్ణోత్సవాలను విద్యారంగ పటిష్టతకు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు వేదికగా ప్రజలను భాగస్వాములను చేస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు కె.శ్రీదేవి, జిల్లా కార్యదర్శులు పి.శివప్రసాద్, జి.లక్ష్మీనారాయణ, పి.క్రాంతికుమార్, ఎస్.రత్నరాజు, టిజె.జయకుమార్, జి.రామకృష్ణంరాజు, సిహెచ్ నాగ శిరోమణి, కె.శ్రీరామకృష్ణ ప్రసాద్, కెఎస్‌సిహెచ్.సాయిరాం, పి.కృష్ణకుమారి, సిహెచ్.కుమార్‌బాబ్జి, ఎం.శ్రీనుబాబు, డి.ఏసుబాబు, రాష్ట్ర కౌన్సిలర్లు జివివి రామానుజరావు, ఎంవి.రాజశేఖర్, బిజెవిడి రాజ్యలక్ష్మి, పిల్లి శ్రీనివాస్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పులకండం శ్రీనివాస్, టివిఆర్ మోహన్‌రావు, ఎంవిఎస్‌ఎస్‌ఆర్ రాజేశ్వరరావు, మండల పట్టణ శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రిగా వర్మ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా ప్రధాని బాధ్యతలు కేటాయించారు. దీనిపై జిల్లా ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేసే యత్నాల్లో భాగంగా మోడీ సర్కార్ ఈ ప్రాంతవాసికి బాధ్యతల అప్పగించిందా అనే వ్యాఖ్యానాలు విన్పించాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భారీ పరిశ్రమలైన ఏలూరులోని జ్యూట్‌మిల్లులు, తణుకులో ఆంధ్రా సుగర్స్, భీమవరం సమీపంలో డెల్టా పేపర్‌మిల్లు వంటివి మూతపడిన సంగతి తెలిసిందే. వర్మ కొత్త పరిశ్రమలు తీసుకురాకపోయినా మూతపడిన పరిశ్రమలనైనా తెరిపించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



కనువిందు చేస్తున్న పుష్పాలు

కనువిందుగా ఎర్ర తురాయి పుష్పాలు

ప్రజాశక్తి - ఆచంట

మండు వేసవిలో కొన్ని జాతుల వృక్షాలు ఆకులు లేకుండా చెట్టు నిండా పూలతో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఆచంట మండలం కరుగోరుమిల్లి - వల్లూరు ప్రధాన రహదారిలో రేలా చెట్టు ద్రాక్ష గుత్తుల్లా వేలాడుతున్న పుష్పాలతో వాహన చోదుకులను, పాదచారులకు ఈ ఎర్ర తురాయి చెట్టు ఆకులు లేకుండా అరుణ వర్ణం పుష్పాలతో ప్రకృతి అందానికి ప్రతిబింబంగా నిలిచింది.

చిరంజీవిని కలిసిన పలువురు

ప్రజాశక్తి - నరసాపురం



చిరంజీవితో చాగంటి

మెగాస్టార్ చిరంజీవిని నరసాపురం నియోజకవర్గ జనసేన నాయకుడు చాగంటి మురళీకృష్ణ(చిన్న) సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా హనుమంతుడి విగ్రహాన్ని చిరంజీవికి మురళీకృష్ణ బహుమానంగా అందించారు.



చిరంజీవిని కలిసిన నాయకర్

నరసాపురం: మెగాస్టార్ చిరంజీవిని నరసాపురం నియోజకవర్గ జనసేన ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవిని నాయకర్ శాలువాతో సత్కరించారు. అనంతరం పూలబొకే అందించి అభినందనలు తెలిపారు. బొమ్మిడి నాయకర్ వెంట ఆయన సోదరుడు సునీల్ ఉన్నారు.

విద్యకు పెద్దపీట వేస్తాం

ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు



విద్యార్థికి చెక్ అందజేస్తున్న ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తమ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేస్తామని అలాగే భీమవరం పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. కాకతీయ అవార్డ్స్ డే ఫంక్షన్ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. భీమవరంకి మెడికల్ కాలేజీ కూడా తీసుకురావాలని, అదేవిధంగా ప్రతి విద్యార్థి విద్యపై శ్రద్ధ పెట్టాలని, ఎల్‌కెజి నుంచి పీజీతో పాటు మెడికల్, అనేక కోర్సులను విద్యార్థులు భీమవరం పట్టణంలోనే అభ్యసించే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. అధ్యక్షులుగా రమేష్, సంస్థ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్‌లను అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్ మాట్లాడుతూ కాకతీయ విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరని, వారు ఉన్నత స్థాయిలో అనేక ఉద్యోగాలు సాధించి మన భీమవరంకు ప్రపంచంలో మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారన్నారు. ఇంతటి ఖ్యాతిని సంపాదించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను, సహకరించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా కొనియాడారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్పు సాధించిన విద్యార్థులను ఎంఎల్‌ఎ ప్రత్యేకంగా అభినందించారు. 600 మార్కులు గాను 590 మార్కులు సాధించిన విద్యార్థిని సత్తి భువన సాహితికి రూ.10 వేల నగదు అందించారు. పలువురు విద్యార్థులకు సైకిళ్లు, ఇతర బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఎంఎల్‌ఎ అంజి బాబును పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ కిషోర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జిల్లా కో-ఆర్డినేటర్ చిన్నయ్య మాస్టారు పాల్గొన్నారు.

వరిలో సుస్థిర సాగుపై అవగాహన పొందాలి

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్



మాట్లాడుతున్న ధన్యంరాజు శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతులు వ్యవసాయంలో, వరిలో సుస్థిర సాగుపై అవగాహన కలిగి ఉండాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ కోరారు. మండలంలోని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ వరి పరిశోధన స్థానంలో వరిలో సుస్థిర సాగు విధానంపై, వరిలో కర్బన ఉద్గరాలుపై రైతు-శాస్త్రవేత్తల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వరి సాగులో అవసరానికి మించి నీటి వినియోగం వల్ల దిగుబడి తగ్గడమే కాకుండా, సాగు ఖర్చులు మరింత పెరిగి నష్టాల బారిన పడతారని హెచ్చరించారు. ఈ యుపిఎల్ భాగస్వామ్య కంపెనీ నర్చర్ పామ్ వారి ఆధ్వర్యంలో మార్టేరు పరిశోధన స్థానంలో గత సంవత్సరం నుంచి ప్రయోగాలు, పరిశోధనలు నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. నర్చర్ పామ్ భారతదేశపు లీడ్ అధికారి ఎస్.రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ యుపిఎల్ కంపెనీ ద్వారా గత రెండు సంవత్సరాల నుంచి గోదావరి, కృష్ణా జిల్లాలో రైతులు భాగస్వామ్యంతో ఊర్లలో కర్బన ఉద్గరాలపై, ఆరుతడి నీటి యాజమాన్యంపై కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ టి.శ్రీనివాస్, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

ఎంఇఒ-2 రాజేంద్ర ప్రసాద్



స్కూల్ బ్యాగులను పరిశీలిస్తున్న ఎంఇఒ-2

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్కూల్ బ్యాగులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామని, నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యను అందించడంతో పాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అమలు చేస్తూ విద్యార్థి సంపూర్ణ వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదం చేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 13వ తేదీన ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందుబాటులో ఉంచామని, స్కూల్ బ్యాగ్‌లో బెల్టులు, బూట్లను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు.

గీత కార్మికులకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సిఎం చంద్రబాబును కలిసిన అంగర రామ్మోహన్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నిర్ణయించే ఎక్సైజ్ పాలసీలో గీత కార్మికులకు 20 శాతం దుకాణాలు కేటాయింపుల్లో రిజర్వేషన్లు కల్పించాలని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నాయుడు నివాసంలో మాజీ ఎంఎల్‌సి అంగర సోమవారం ఆయన్ని కలిశారు. ఈనెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర మంత్రులను కలిసిన నాయకర్

నరసాపురం: కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మను ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, అతని సోదరుడు సునిల్ సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల ఇక్కట్లు

ప్రత్యామ్నాయం చూపాలని ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - ఆకివీడు

రైల్వే టికెట్ల కోసం ఇక్కడ ప్రయాణికుల ఇబ్బంది వర్ణనాతీతం. లక్షల రూపాయలు ఆదాయం తెచ్చిపెట్టే రైల్వే స్టేషన్‌కు టికెట్లు బుకింగ్ కౌంటర్ ఒకటి. ఇక్కడ సగటున పగలు గంటకొక రైలు వెళ్తూ ఉంటుంది. ఈ రైళ్లల్లో ప్రయాణం కోసం టికెట్ల కౌంటర్ వద్ద ఎప్పుడూ ప్రయాణికులు లైన్‌లో నుంచునే ఉంటారు. ఇదిలా ఉండగా రిజర్వేషన్ పరిస్థితి ఇక్కడ ప్రధాన సమస్య. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంకాలం నాలుగు నుంచి ఆరు గంటల మధ్యలో గంటన్నర పాటు సాధారణ రిజర్వేషన్ టికెట్లు ఇస్తారు. ఇక్కడ ఒకే కౌంటర్‌లో రెండు విభాగాలు టికెట్లు తీసుకునే వారికి వర్షం మొదలవుతోంది. ఇదే కౌంటర్‌లో మూడో రకం టికెట్లకు కూడా ప్రవేశం కలుగుతుంది. అదే తత్కాల్ టికెట్లు ఉదయం 10 గంటలకు ఏసీ టికెట్లు, 11 గంటలకు నాన్ ఏసీ టికెట్లు తత్కాల్లో వస్తాయి. ఆ టికెట్లు కూడా ఇదే కౌంటర్‌లో ఇస్తారు. తత్కాల్ టికెట్లు కంప్యూటర్ కొట్టే సమయంలో మామూలు రిజర్వేషన్ టికెట్లు అయిపోతాయేమోనని సాధారణ రిజర్వేషన్ వాళ్లు కంగారు. అదే సమయంలో రైలు వెళ్లి పోతుందేమోనని సాధారణ ప్రయాణికులకు ఆందోళన. ఒకపక్క సాధారణ టికెట్లు మరోపక్క సాధారణ రిజర్వేషన్ టికెట్లు మూడో రకంగా తత్కాల్ ఇన్ని రకాల టికెట్లకు ఒకే కౌంటర్ జనాలు గుమ్మిగూడడం భయంకరంగా ఉంటుంది. ఇక్కడ ప్రతిరోజు ఇది సర్వసాధారణంగా తయారైంది. ఎంతమంది ఎన్నిసార్లు, ఎన్ని రకాలుగా విజ్ఞాపన చేసినా పట్టించుకునే నాధుడు లేడు. గతంలో రెండు కౌంటర్లలో టికెట్లు ఇచ్చేవారు. ఇప్పుడు అకౌంటెంట్‌ని తగ్గించి వేసి ప్రయాణికులకు రైల్వే శాఖ చుక్కలు చూపిస్తోంది. ఒకటి రెండు కాదు ఈ డివిజన్ మొత్తంలోనే గూడ్స్‌లో అత్యధిక ఆదాయం ఇచ్చే స్టేషన్ ఇది. ఇక ప్రయాణికుల ప్రయాణించే స్థాయి కూడా ఎక్కువే. ఇక్కడ ఎక్కువ మందే ఉంటారు. రెండు ప్లాట్‌ఫామ్స్ నిండా ఎప్పుడు ప్రయాణికులు ఉంటారు. అనుకోకుండా ఇక్కడ ఎవరో ఒకరు రైలు మిస్ అవ్వడం కాని రిజర్వేషన్ మిస్ అవ్వడం కానీ జరుగుతూనే ఉంటాయి. కానీ వాటిని అధికారులు పట్టించుకోవటం లేదని, ప్రత్యామ్నాయం చూపటం లేదని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


టికెట్ కౌంటర్ వద్ద క్యూ కట్టిన ప్రయాణికులు

'బోధన, పరిశోధనా పద్ధతి'పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - నరసాపురం

పూర్వం చదువులకు ఇప్పటి చదువులకు చాలా వ్యత్యాసం ఉందని, అప్పుడు విద్యార్థులు ఉపాధ్యాయులను చూసి భయపడేవారని, వారికి గౌరవాన్నిచ్చే వారని ఇప్పుడంతా భిన్నంగా ఉందని రిటైర్డ్ సీనియర్ స్పెషల్ అసిస్టెంట్ ఎస్‌బిఐ ఉద్యోగి, ఈనాడు పత్రికా సంపాదకీయులు డాక్టర్ యర్రాప్రగడ రామకృష్ణ అన్నారు. స్థానిక వైఎన్.కళాశాలలో కళాశాల, ఐక్యూ ఏసి సంయుక్తంగా 'బోధన, పరిశోధనా పద్ధతి' అనే అంశంపై రెండు రోజులు వర్క్ షాపును సోమవారం ప్రారంభించారు. ఈ వర్క్ షాప్‌కు మొదటి విభాగంలో ముఖ్య అతిథిగా యర్రాప్రగడ రామకృష్ణ విచ్చేసి 'ఆధునిక యుగంలో ఉపాధ్యాయుల పాత్ర, బాధ్యత' అనే అంశంపై అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి విద్యార్థులకు గురువంటే భయం, భక్తి కొరవడినవని, అంతా తమకే తెలుసు అనే భావనతో ఉన్నారని, కాబట్టి నేటి ఆధునిక పరిస్థితుల్లో దానికి తగినట్లుగా, వారి నైపుణ్యాన్ని బట్టి మన ప్రణాళికలను వేసుకోవాలని తెలిపారు. ఇప్పటి విద్యార్థులకు తెలివైన గుణకం(ఐక్యూ)తో పాటు భావోద్వేగ గుణకం(ఇక్యూ) బాగా ఉందని, అందుకే చిన్న చిన్న విషయాలను సైతం తట్టుకోలేక ఛిద్రమవుతున్నారని, వారిలో ఆత్మన్యూన్యత భావాన్ని తొలగించి ధైర్యాన్ని నింపవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు.

రెండవ విభాగంలో రిసోర్స్ పర్సన్‌గా కళాశాల వైస్ ప్రెసిడెంట్ పొన్నపల్లి రామారావు 'మానవ విలువలు, వృత్తిపరమైన నీతులు' అనే అంశంపై మాట్లాడుతూ 'నిజాయితీ, న్యాయబద్ధత, గౌరవం, బాధ్యత, సంరక్షణ, పౌరసత్వం అనే ప్రధాన విలువలు ఏ మానవ సమాజానికైనా ప్రధానమైనవని, వాటిని జీవితంలోని ప్రతీ ప్రాంతంలోనూ వర్తింపచేయాలని తెలిపారు. మానవ విలువలు వ్యక్తిగత నమ్మకాన్ని తెలియజేస్తాయని, నైతికత సంస్థకు వర్తించే నైతిక విధులు, ధర్మాల గురించి ఆమోదించబడిన సూత్రాలు, ప్రవర్తనా ప్రమాణాలను వివరిస్తూ వాటిని విద్యార్థులకు వారి స్థాయికి తగినట్లుగా చెప్పగలిగితే వారు రేపటి భవిష్యత్తుకు పునాది అవుతారని అన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌విఎస్.సాయిబాబా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యానారాయణ రావు, జిబి.మెంబర్ రెడ్డప్ప ధవేజీ, రిటైర్డ్ సైంటిస్ట్, కళాశాల రీసెర్చ్ అడ్వైజర్ ఆర్‌వి.సుబ్బారావు, పీజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నిమ్మల చింతారావు పాల్గొన్నారు.


సిమెంట్ రోడ్లును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

సిమెంట్ రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామంలో పలు సిమెంట్ రోడ్లును క్వాలిటీ కంట్రోల్ ఎఇ రామరాజు సోమవారం పరిశీలించారు. జువ్వలపాలెం తూర్పు పేటలో నిర్మించిన జెడ్‌పి నిధులు రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్ల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి కొలతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రోడ్లను నిర్మించారు. ఆయన వెంట పంచాయతీ రాజ్ ఎఇ రమేష్ బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వి.లక్ష్మణరావు ఉన్నారు.

విధ్వంసాలు సృష్టించడం అనైతిక చర్య

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన మరుక్షణం నుంచే టిడిపి శ్రేణులు రాష్ట్రంలో వైసిపి నాయకులు, సచివాలయాలు, వైఎస్‌ఆర్ విగ్రహాలపై విధ్వంసాలు సృష్టించడం అనైతిక చర్య అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం ఆచంటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో జయాపజయాలు సర్వసాధారణమని, గెలిచిన పార్టీ అంతకు ముందున్న పార్టీ కన్నా ఎక్కువ స్థాయిలో ప్రజలకు మంచి చేయడంలో పోటీపడాలి తప్ప, ఇటువంటి విధ్వంసకర పరిస్థితులు కల్పించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని హితవు పలికారు. ఇటువంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయన్నారు. విజయాన్ని ఆస్వాదించండి తప్ప విధ్వంసాలకు పాల్పడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో ఈనెల 11న శ్రీగౌతమి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. ఏపి ప్రభుత్వం, కాశినాథ వికాస్, శ్రీగౌతమి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 11న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయని, 18-45 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థులు, పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న విద్యార్థులు అర్హులన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. ఈ ఇంటర్వ్యూలకు 18 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, ఎంపికైన విద్యార్థులకు వెంటనే మంజూరు పత్రాలను అందిస్తారని తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారిణి యు.నవనీత్ తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చిన డెబ్బై ఐదు మందికి హిమో గ్లోబిన్, బ్లడ్‌షుగర్, విడిఆర్‌ఎల్, హెఐవి, మలేరియా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వీరికి పోషకాహారం అందజేయడంలో భాగంగా వీరవాసరం తులసి కన్వెన్షన్ యాజమాన్యం మల్ల రాంబాబు ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కె.శిరీష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న కూటమి నేతలు

కూటమి విజయోత్సవ సంబరాలు

ప్రజాశక్తి - ఉండి

కూటమి విజయోత్సవ సంబరాల్లో భాగంగా సోమవారం టిడిపి ఉండి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉండి పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు విసుగు చెందిన ప్రజలు ఏకతాటి పైకి వచ్చి టిడిపి కూటమిని అధికారంలోకి తీసుకు వచ్చినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు కట్టబెట్టారన్నారు. ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు, జనసేన మండల అధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వరరావు, బిజెపి మండల అధ్యక్షులు యర్రా విక్రమ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు కాగిత మహంకాళి, మంతెన సాయి లచ్చిరాజు, కాగిత బుజ్జి, కరిమెరక శ్రీనివాస్, రుద్రరాజు యువరాజు, మజ్జి కృష్ణప్రసాద్, కర్రి శ్రీనివాస్, కురిటి అప్పారావు, మోపిదేవి హరి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి పెనుగొండ

దొంగరాయపాలెంలో రోడ్డు దాటుతుండగా పెరవలి నుంచి రావులపాలెం వెళుతున్న కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెనుగొండ మండలం, దొంగరావిపాలెం జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పెనుగొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోడూరు మండలం, జిన్నూరు గ్రామానికి చెందిన వీరవల్లి వెంకటపతి(75) తలకు బలమైన గాయం తగలడంతో మెరుగైన వైద్యం కోసం తణుకు తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయన వృత్తి రీత్యా కత్తి పీటల వ్యాపారం చేస్తుంటాడన్నారు. వ్యాపార నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై వెళుతూ ఉండగా దొంగరావిపాలెం వద్ద జాతీయ రహదారి దాటుతూ ప్రమాదానికి గురైయ్యాడన్నారు. హైవే అంబులెన్స్‌లో తణుకు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెనుగొండ ఎస్ఐ షేక్ సుభాని తెలిపారు. మృతునికి భార్య ఉన్నారు. కొడుకు ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో చనిపోవడంతో మనవడు, భార్య తన మీదే ఆధారపడ్డారని బంధువులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఉండి

వివాహిత నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని పాములపర్రు శివారు కొండగూడెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. రాయగడ నాగమల్లేశ్వరి భర్త ఉద్యోగ నిమిత్తం వేరే రాష్ట్రంలో ఉంటున్నాడు. ఆమెకు దూరపు బంధువులైన దువ్వాని మంగాదేవి, విజయ్ బాబు, మానేపల్లి రాజబాబులు ఈనెల 6వ తేదీ రాత్రి నాగమల్లేశ్వరి ఇంటికి వెళ్లి దువ్వాని మోహన్ ఎక్కడున్నాడని అసభ్య పదజాలంతో దూషించి ఆమెపై భౌతికంగా దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన నాగమల్లేశ్వరి సోమవారం ఉదయం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆసుపత్రిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఉండి ఎఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న పితాని

దళిత వర్గాల అభ్యున్నతికి కృషి

ఎంఎల్‌ఎ పితాని

ప్రజాశక్తి - పోడూరు

దళిత వర్గాల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ మంత్రి, స్థానిక ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని దళిత నాయకులు సార్వత్రిక ఎన్నికల్లో పితాని ఘన విజయం సాధించినందుకు ఆయన స్వగృహం కొమ్ము చిక్కాలలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళితులకు చెందాల్సిన 27 పథకాలు, ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు, అంబేద్కర్ విదేశీ విద్య వంటి వాటిని రద్దు చేసిందని, వాటిని తమ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అలాగే దళిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆచంట నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు బీరా నరసింహ మూర్తి, సిద్ధాంతం, పెనుగొండ సర్పంచిలు నక్కా సోనిశాస్త్రి, చిన్ని, నాయకులు శిర్రా బాలాజీ, ఆకుమర్తి మోహన్ రావు, రాజేష్, వెంకటేశ్వరరావు, వర్ధనపు హరికృష్ణ పాల్గొన్నారు.

గుడికి వచ్చా.. రాజకీయాలు ఇక్కడొద్దు

ఎంఎల్‌ఎ ఆర్ఆర్ఆర్

ప్రజాశక్తి - ఆకివీడు

నేను హోమం కోసం దేవాలయానికి వచ్చాను, ఇక్కడ రాజకీయాలు మాట్లాడను, మరోసారి వస్తాను అప్పుడు మాట్లాడుతాను అని నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. ఎంఎల్‌ఎగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా ఆయన సోమవారం ఆకివీడు వచ్చారు. స్థానిక దత్తాత్రేయ దేవాలయంలో జరిగిన గాయత్రి హోమం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. చివరగా వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ దేవాలయంలో రాజకీయాలు మాట్లాడనని చెప్పారు. అక్కడి నుంచి ఆయన సరాసరి భీమవరం వెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్, టిడిపి నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం), జనసేన నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, బిజెపి పట్టణ అధ్యక్షులు చిట్టిబాబు, కూటమి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సినీ హీరో, హిందూపురం ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణ 65వ పుట్టినరోజు వేడుకలను సోమవారం భీమవరంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కార్యాలయం వద్ద భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజి బాబు) కేక్ కట్ చేసి బాలకృష్ణకి శుభాకాంక్షలు తెలిపారు. నందమూరి బాలకృష్ణ, ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు పడమట సోమేశ్వరరావు, సెక్రెటరీ సాంబ్రాణి నాగబాబు, నందమూరి యువసేన జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామకష్ణ చౌదరి ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లకు పాలు, బ్రెడ్లు, ఫుడ్స్ పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, చల్లబోయిన గోవిందు, టిడిపి పట్టణ కార్యదర్శి గూడూరు సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా సింహాచలం పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉండి

ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామ మాజీ సర్పంచి, వైసిపి సీనియర్ నాయకులు మునుకోలు సింహాచలం జన్మదినోత్సవ వేడుకలు సోమవారం శ్రేయోభిలాషులు, అభిమానుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉండి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద ఉన్న తన కార్యాలయంలో మిత్రులు, శ్రేయోభిలాషులు, వైసిపి నాయకుల నడుమ కేక్ కట్ చేసి, మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతమంది అభిమానుల నడుమ తమ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరిమెరక శివ నాగరాజు, బడుగు బాలాజీ, ఇల్లాపు అప్పాజీ పాల్గొన్నారు.

పితానిని కలిసిన రాష్ట్ర, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ నేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట ఎంఎల్‌ఎగా గెలుపొందిన పితాని సత్యనారాయణను సోమవారం రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు కలిసి శాలువ, పుష్ప గుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సంఘం తరుపున వారికి అభినందనలు అందించారు.

బ్యాంకును ఖాళీ చేసి భవనాన్ని అప్పగించాలి

ఆందోళన చేస్తున్న ఇంటి యజమానురాలు దుర్గాంబ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల గ్రామంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా కాళ్ల బ్రాంచిని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అద్దెకు తీసుకున్న సమయం ముగిసినా తమ భవనాన్ని ఖాళీ చేయకుండా బ్యాంకు ఉద్యోగులు కాలయాపన చేస్తున్నారని ఇంటి యజమానురాలు బండారు దుర్గాంబ ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు ఉద్యోగుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఇంటి యజమానురాలు బండారు దుర్గాంబ(వికలాంగురాలు) కుటుంబ సభ్యులతో కలిసి బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014లో ఇల్లు నిర్మిస్తున్న సమయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా కాళ్ల బ్రాంచి వ్యాపార కార్యకలాపాల నిమిత్తం అద్దె భవనం కావాలని కోరడంతో గ్రౌండ్ ఫ్లోర్ అద్దెకు ఇవ్వడం జరిగిందన్నారు. 2014 నుంచి 2024(10 సంవత్సరాల) కాలానికి అద్దె అగ్రిమెంట్ చేయించుకుని ఇప్పటి వరకు కొనసాగుతుందన్నారు. లీజ్ గడువు మార్చి నెలాఖారుతో ముగిసిందన్నారు. వికలాంగురాలిని కావడంతో అనారోగ్య కారణాలతో పై అంతస్తు నుంచి కిందకు, పైకి ఎక్కేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నానన్నారు. 2023 నుంచి బ్యాంకును నిర్వహించే భవనాన్ని ఖాళీ చేసి అప్పగించాలని బ్యాంక్ మేనేజర్‌కు అనేకసార్లు విన్నవించినా సరైన సమాధానం రాలేదన్నారు. ఇప్పటికైనా బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకును ఖాళీ చేసి భవనాన్ని అప్పగించాలని కోరారు.



బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న ఇంటి యజమానురాలు

రామోజీరావు స్ఫూర్తితో పయనిద్దాం


నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తెలుగువారి ప్రతి జీవితంలో రామోజీరావు స్ఫూర్తి ఉందని, అది నిరంతరం వెలుగుతూనే ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో అక్షర యోధుడు, ఈనాడు సంస్థల ఛైర్మన్ రామోజీరావు మరణానికి చింతిస్తూ ఎపియుడబ్ల్యూజెఎఫ్ భీమవరం ఆధ్వర్యంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపియుడబ్ల్యూజెఎఫ్ సభ్యులు మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టి, బహుముఖ ప్రజ్ఞతో అసాధ్యాలను సుసాధ్యం చేసి, పట్టుదలకు మారుపేరుగా నిలిచిన రామోజీరావు తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని కృషి చేశారన్నారు. అన్నదాత, చతుర, విపుల, తెలుగు వెలుగు పత్రికలు ఆయావర్గాల ఆదరణ పొందాయని గుర్తు చేశారు. రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటని, పాత్రికేయులకు ఆయన దారి దీపమని, సమాజానికి ఆయన నిరుపమాన సేవలు చేశారని అన్నారు. వైఫల్యాల్ని విజయాలుగా మార్చుకున్న గొప్పధీరుడని కొనియాడారు. వివిధ రంగాల్లో విశేషమైన విజయాలు సాధించి దూరదృష్టి కలిగిన పారిశ్రామికవేత్తగా రామోజీరావు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజెఎఫ్ సభ్యులు గుండా రామకృష్ణ, ధనరాజ్(నాని), గూడూరి నాగరాజు, బి.శివ వర్మ, అరేటీ శ్రీనివాస్, కేతా సత్యనారాయణ, కడలి సాయిబాబా, మాదిరెడ్డి రాజేష్, అల్లూరి అరుణ్, క్రాంతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ఎంపిపి అందె సూర్యవతి

మొగల్తూరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపిపి అందె సూర్యవతి అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లోని తాగునీరు, విద్యుత్తు, రహదారి తదితర సమస్యలను పరిష్కరించాలని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు సమావేశంలో మాట్లాడారు. శాఖల వారీగా సమీక్షించారు. ఈ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్య నిమిత్తం ఉన్నత అధికారులకు నివేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కేకును కోసిన ఎంపిపి సూర్యవతి

కుటమి విజయం సాధించినందుకు జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును ఎంపిపి సూర్యావతి కోసి పంపిణీ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానిగా, నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని కేకును ఏర్పాటు చేసి, కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే.. దేశ ప్రగతి

20 మంది విద్యార్థులకు రూ.60 వేల ప్రోత్సాహక బహుమతులు అందజేసిన ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యే జీవన మనుగడకు మార్గదర్శకమని, సంపూర్ణ విద్యతోనే దేశ ప్రగతి ఉంటుందని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ అంజిబాబు కార్యాలయంలో, తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవనం ట్రస్ట్ సహకారంతో 20 మంది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ భీమవరం మున్సిపల్ పాఠశాలలో దశాబ్దాల కాలంగా పదో తరగతి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రగతి సాధించడం గొప్ప విశేషమని అన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు తుమ్మలపల్లి మంగరాజు విశ్రాంతి భవనం ట్రస్ట్ ప్రోత్సాహం అందించడం అభినందనీయమని అన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి శివ మాట్లాడుతూ తమ తండ్రి కీర్తిశేషులు మంగారాజు పేరిట ప్రతి ఏడాది పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్నామన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్ హైస్కుల్లోని 20 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.3 వేలు చొప్పున, రూ.60 వేలు ప్రోత్సాహ బహుమతులను అందజేశామని అన్నారు. కార్యక్రమంలో ఆయా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.సత్యనారాయణ మూర్తి, బి.శ్రీనివాస్, విశ్వనాథ్ రాజు, ఎం.సుధారాణి, కోడె వెంకటరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

పెనుమంట్ర: నీట్ - 2024 ఎంట్రన్స్ టెస్ట్‌లో మెడికల్ సీట్ వచ్చిన పేదవారికి నిచ్చెనమెట్ల చారిటిబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ట్రస్ట్ ప్రతినిధి పద్మనాభయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అవసరం ఉన్నవారు ఈనెల 20వ తేదీలోపు 6301390253 నెంబర్‌కు వివరాల కోసం సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

మావుళ్లమ్మ జాతర మహోత్సవం కమిటీ ఎన్నిక

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు దేవాంగులపేటలో వేంచేసియున్న మావుళ్లమ్మ అమ్మవారి నూతన ఉత్సాహ కమిటీని సంఘ సభ్యుల సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూలై 5 శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి దర్శనం, 10 గంటలకు ఉత్సవ ఊరేగింపు జరుగుతుందని వారు తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా మాన్యం రవికుమార్, కార్యదర్శిగా అల్లాడ రామకృష్ణ, కోశాధికారి పిచ్చుక వరప్రసాద్, సహాయ కార్యదర్శి వట్టం లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్‌గా కొడవటి బాల వీరభద్రరావు, కార్యవర్గ సభ్యులుగా మాన్యం మహేష్, కొడవటి శ్రీను, కొమ్మని సాయి, వట్టం లక్ష్మణ్, కేదారేశ్వర, మాన్యం శివకేశవ అల్లాడ మోహన్, అల్లాడ ప్రశాంత్, మాన్యం గౌతం ప్రణయ్, కొడవటి రాంబాబు, అరవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భరత్ కృతజ్ఞతా పర్యటన

ఆకివీడు: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా ఎన్నికైన కనుమూరు రఘురామకృష్ణంరాజు తనయుడు భరత్ పట్టణంలో కృతజ్ఞతా పర్యటన నిర్వహించారు. సోమవారం రాత్రి పట్టణంలోని పలు వీధుల్లో ఆయన ఈ పర్యటన జరిపారు. ముందుగా పోలీస్ స్టేషన్ సమీపంలో భరత్‌కు కూటమి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీల నాయకులు పాల్గొన్నారు.